సాక్షి
సూర్యాపేట
శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



ట్రాక్టర్‌పై వెళ్లి..
వర్షంతో కేశవాపురానికి రాకపోకలు నిలిచిపోవడంతో వైద్య సిబ్బంది ట్రాక్టర్ వెళ్లి వైద్యం అందించారు.
- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 588.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 54,917 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 38,361 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,232 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,529 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: నిల్
ఏఎమ్మార్పీకి	: నిల్
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	641.60 అడుగులు
ఇన్‌ఫ్లో	: 5,680 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 2,445 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

నేడు తొగర్రాయికి కేంద్ర మంత్రి బండి సంజయ్ రాక

కోదాడరూరల్ : భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన కోదాడ మండల పరిధిలోని తొగర్రాయి గ్రామాన్ని సందర్శించేందుకు శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయమంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ రానున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఓర్సు వేలంగిరాజు, నియోజకవర్గ కన్వీనర్ కనగాల నారాయణలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బండి సంజయ్‌తో పాటు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి , రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు కూడా రానున్నట్లు పేర్కొన్నారు.

అనుమతులు లేని ఆస్పత్రులు సీజ్

సూర్యాపేటటౌన్ : జిల్లాలో అనుమతులు లేకుండా ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తే సీజ్ చేస్తామని డీఎంహెచ్‌ఓ కోటాచలం హెచ్చరించారు. సూర్యాపేట పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న సత్యనారాయణ క్లినిక్‌ను డీఎంహెచ్‌ఓ కోటాచలం గురువారం తనిఖీ చేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలోనే నిబంధనలు ఉల్లంఘించి ఈ క్లినిక్ నిర్వహిస్తే రిజిస్ట్రేషన్ రద్దు చేశామని, మళ్లీ అర్హతలేకుండా నిర్వహించడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి. చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనిత రాణి, గణాంక అధికారి పి. వీరయ్య, ఇన్‌చార్జి డిప్యూటీ డెమో మనోహర రాణి పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన అమలు చేయాలి



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు హసేన్

హుజూర్‌నగర్ : జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు హసేన్ కోరారు. గురువారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మాల మహానాడు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో దేశంలో కొన్ని కులాలు ఆందోళనకు గురయ్యాయన్నారు. ఈవిషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి అన్ని వర్గాలకు సమన్యాయం చేయడానికి కలిసి రావాలని ఆయన కోరారు. వెంటనే కులగణ చేపట్టి పెరిగిన జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లను అమలు చేయాలని ఆయన కోరారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు ఐ. శ్రీనివాసరావు, ఐ. బెంజిమెన్, వి. రాములు, రామకృష్ణ, విమన్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వ కట్ట మరమ్మతులకు రూ.2.10కోట్లు

నడిగూడెం : నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం సమీపాన నాగార్జున సాగర్ ఎడమ కాల్వ కట్టపై 132.02, 132.15 కిలో మీటర్ల వద్ద ఈ నెల 1న గండ్లు పడ్డాయి. దీంతో నడిగూడెం మండలంతో పాటు, ఖమ్మం జిల్లాకు చెందిన ఆరు గ్రామాల రైతుల పొలాలు నీట మునిగి పంట నష్టం జరిగింది. దీంతో తెగిన కాల్వ కట్ట మరమ్మతులకు రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా గురువారం అత్యవసర పనుల కింద రూ.2,10,50,000 మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో త్వరలోనే పనులు చేపట్టనున్నారు.

ప్రతి సోమవారం 'డయల్ యువర్ చైర్‌పర్సన్'



తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ

తిరుమలగిరి: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయంలో డయల్ యువర్ చైర్‌పర్సన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ చాగంటి అనసూయ తెలిపారు. గురువారం నిర్వహించిన డయల్ యువర్ చైర్‌పర్సన్ కార్యక్రమంలో అధికారులతో కలిసి ఆమె పాల్గొన్నారు. పలు వార్డుల నుంచి పలువులు ప్రజలు పారిశుద్ధ్యలోపం, మంచినీటి సమస్య, కోతులు, కుక్కల బెడద వాటి నివారణ చర్యలు, సీసీ రోడ్లు తదితర సమస్యలను ఫోన్‌ద్వారా చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడారు. సమస్యలు ఏమైనా ఉంటే 9885035904, 9704093797, 9963736687, 9666458811, 9502910779, 9959386841 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.లక్ష్మణ్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి రాష్ట్ర ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఎంజీయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అధ్యాపకుడు మిర్యాల రమేష్, నల్లగొండ ఎన్జీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఎం.అనిల్‌కుమార్, ఆర్.శ్రీధర్, రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్ డాక్టర్ కృష్ణకౌండిన్య, మిర్యాలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్ఏ కృష్ణకాంత్‌నాయక్, చివ్వెంల మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ సైన్స్ టీచర్ గిరిప్రసాద్

25,967 ఎకరాల్లో పంటలకు నష్టం



నూతనకల్ మండలం గుండ్లసింగారం కత్వ వద్ద వరద ఉధృతికి వరి పొలంలో వేసిన ఇసుక మేట

వరి 18,693 ఎకరాలు, పత్తి 6,776 ఎకరాల్లో ..

- వరదలకు వరి, పత్తి చేలల్లో ఇసుకమేటలు
- తెగిన చెరువులు, కుంటలు, సాగర్ కాల్వలు
- దెబ్బతిన్న రహదారులు
- పంటల నష్టం అంచనాల్లో అధికారులు

సూర్యాపేట : జిల్లాలో నాలుగైదు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు అన్నదాతకు కన్నీరు మిగిల్చాయి. వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు, కుంటలు పొంగిపొర్లి వరి, పత్తి చేలల్లో ఇసుకమేటలు వేశాయి. చాలా చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. సాగర్, మూసీ కాల్వలు తెగిపోయాయి. నష్టం అంచనా వేసే పనుల్లో అధికారులు తలమునకలయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 25,967 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు సర్వేలో తేలింది.

11,950 ఎకరాల్లో ఇసుకమేటలు

భారీ వర్షాలకు జిల్లాలో మొత్తం 18,693 ఎకరాల్లో వరి, 6,776 ఎకరాల్లో పత్తి, 460 ఎకరాల్లో మిర్చి, 38 ఎకరాల్లో కంది పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. 11,950 ఎకరాల్లో వరదలతో చేలల్లో ఇసుక మేట వేసినట్లు సర్వేల్లో తేలింది. ,ప్రధానంగా కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో రైతాంగానికి తీవ్రంగా నష్టం జరిగినట్లు భావిస్తున్నారు.

దెబ్బతిన్న రహదారులు..

జిల్లాలో వర్షాల కారణంగా ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. మొత్తం 11 చోట్ల రోడ్లు తెగిపోయాయి. మరో 16 చోట్ల రోడ్లు పూర్తిగా ధ్వంసమైపోయినట్లు రోడ్లు భవనాల శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కోదాడ డివిజన్‌లో మొత్తం పది చోట్ల రోడ్లు దెబ్బతిన్నట్లు పంచాయతీ రాజ్ శాఖ అధికారులు అంచనా వేశారు. తాత్కాలిక మరమ్మతులకు రూ.2 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.40.25 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. సూర్యాపేట డివిజన్‌లో రెండు చోట్ల రోడ్లు తెగిపోగా.. ఐదు చోట్ల దెబ్బతిన్నాయి. రహదారుల తాత్కాలిక మరమ్మతులకు రూ.80 లక్షలు, శాశ్వత మరమ్మతులకు రూ.57 కోట్లు అవసరమని అంచనా వేశారు.

కూలిన ఇళ్లు..

జిల్లాలో పలుచోట్ల కొన్ని ఇళ్లు పూర్తిగా మరికొన్ని పాక్షికంగా కూలిపోయాయి. కోదాడ డివిజన్‌లో 6 గృహాలు పూర్తిగా దెబ్బతినగా.. 21 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. హుజూర్‌నగర్ డివిజన్ లో 5 ఇళ్లు పూర్తిగా కూలిపోగా.. 7 పాక్షికంగా దెబ్బతిన్నాయి. సూర్యాపేట డివిజన్‌లో 27 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

చెరువులకు గండ్లు.. తెగిన కాలువలు..

వరదల ధాటికి జిల్లాలో పలుచోట్ల చెరువులకు గండ్లు పడగా ఎస్సారెస్పీ, సాగర్, మూసీ కాలువలు తెగిపోయాయి. హుజూర్‌నగర్ డివిజన్‌లో ఎనిమిది చెరువులు తెగిపోగా.. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ 14.38 కిలోమీటర్ వద్ద తెగింది. యాతవాకిళ్లలో సాగర్ ఎడమ కాలువ తెగింది. వేములూరు ప్రాజెక్టు ఎడమ కాలువ కిలోమీటర్ 5 నుంచి కిలోమీటర్ 8, కిలోమీటర్ 9,10,20 వద్ద తెగింది. కోదాడ డివిజన్‌లో 4 చెరువులకు గండ్లు పడ్డాయి. రెడ్డికుంట కాలువ తెగింది. సూర్యాపేట డివిజన్‌లో మూడు చెరువులకు గండ్లు పడగా.. మూసీ ఎడమ కాలువకు పిన్నాయిపాలెం, పిల్లలమర్రి గ్రామాల మధ్య గండిపడింది.



మఠంపల్లిలోని మామిళ్ల చెరువుకు పడిన గండి (ఫైల్)



చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో పొలాల్లో వేసిన ఇసుకమేట

మట్టి గణేష్ విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవార్, చిత్రంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, అధికారులు

- మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలి
- శాంతిసంఘం సమావేశంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేటటౌన్ : మట్టి గణేష్ విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ సూచించారు. ఈ నెల 7 నుంచి నిర్వహించే వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శాంతిసంఘం సమావేశంలో ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణలో ప్లాస్టిక్ ను వినియోగించవద్దని కోరారు. అధికారులు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పని చేయాలని, వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. అన్ని విగ్రహాల వద్ద శానిటేషన్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్థానికంగా ఉన్న చెరువులు, కుంటల్లో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేయడానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. దూర ప్రాంతాలకు వెళ్లి ప్రమాదాల బారినపడవద్దని విజ్ఞప్తిచేశారు. నిమజ్జన ప్రాంతాల్లో లైటింగ్, క్రేన్ ఏర్పాటు చేయడం, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడం, శానిటేషన్ చేయడంలాంటి పనులు సమన్వయంతో చేయాలన్నారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ మాట్లాడుతూ ఇప్పటివరకు గణేష్ ఉత్సవాల సమయంలో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకపోవడం చాలా సంతోషకరమైన విషయమని, ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలన్నారు. భవిష్యత్తులో కూడా ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీలు తమవంతు పాత్ర పోషించాలని కోరారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్టమైన పోలీసు భద్రత ఉంటుందని, నిమజ్జనమయ్యే వరకు జిల్లాలో ప్రతి గణేష్ మండపానికి 24 గంటలు భద్రత కల్పిస్తామన్నారు. ఉత్సవాలను పోటీగా కాకుండా అందరూ కలిసిమెలిసి భక్తి భావంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. గణేష్ మండపాల ఏర్పాటుకు ముందస్తుగా ఆన్లైన్‌లో అనుమతులు తీసుకోవాలని కోరారు. వివాదాస్పదమైన స్థలాల్లో, రోడ్లపై మండపాలు ఏర్పాటు చేయవద్దని కోరారు. డీజేలు పూర్తిగా నిషేధమని, డీజేలు పెట్టినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంలు నమ్మవద్దని, ఏదైనా ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీలు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

- డీఏఓ శ్రీధర్‌రెడ్డి



వెలుగుపల్లిలో ఇసుక మేట వేసిన పంట పొలాలను పరిశీలిస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

తుంగతుర్తి: పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి కోరారు. గురువారం తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామ శివారులో ఇసుక మేటలు వేసిన పంట పొలాలను పరిశీలించిన అనంతరం తుంగతుర్తిలోని పలు ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లాలో ఇప్పటికే దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇసుక మేట వేసిన ప్రతి ఎకరానికి ప్రభుత్వం రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించనున్నట్లు చెప్పారు. పంట నష్టం పై పూర్తిస్థాయిలో సర్వే చేస్తున్నామని ప్రభుత్వం ప్రతి ఎకరానికి రూ.10వేలు నష్టపరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాల్లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టం గురించి సేకరించిన వివరాలను ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తామన్నారు. తమ సిబ్బంది ఈనెల12వ తేదీ లోపు రైతుల వద్దకే వెళ్లి రుణమాఫీ కానీ రైతుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. ఇప్పటి వరకు రూ.లక్ష లోపు రుణాలను జిల్లాలోని 56,217 మంది రైతులకు సంబంధించి రూ.282కోట్లు 78 లక్షలు, రెండో విడత లక్షన్నర లోపు రుణాలు 26,376 మంది రైతులకు సంబంధించి రూ.250 కోట్లు, మూడో విడత రుణమాఫీ కింద 17,952 మంది రైతులకు రూ. 305కోట్ల 91 లక్షల 87 వేలు రుణమాఫీ అయినట్లు వివరించారు. ఆయన వెంట ఏఓ బాలకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

చిట్యాలలో 'ఐఏఎఫ్' హెలికాప్టర్ ల్యాండింగ్

- సాంకేతిక లోపంతో పొలాల మధ్య ఆపిన పైలెట్
- తప్పిన ప్రమాదం

చిట్యాల: చిట్యాల పట్టణ శివారులోని వ్యవసాయ పొలాల్లో గురువారం ఐఏఎఫ్(ఇండియన్ ఎయిర్ ఫోర్స్)కు చెందిన హెలికాప్టర్ సాంకేతిక లోపంతో ఆగిపోయింది. విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు వెళ్లిన రెండు హెలికాప్టర్లు అనంతరం హకీంపేటకు వెళ్లేందుకు గురువారం ఉదయం బయలు దేరాయి. 11:30 గంటల సమయంలో చిట్యాల పట్టణ శివారులోకి రాగానే వాటిలో ఒక హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీన్ని గుర్తించిన పైలెట్ చాకచక్యంగా వ్యవసాయ పొలాల్లో నెమ్మదిగా ల్యాండ్ చేశాడు. అనంతరం ఈ హెలికాప్టర్‌తో వచ్చిన మరో హెలికాప్టర్ సైతం మొదటగా కిందికి దిగింది. సాంకేతిక లోపంతో నిలిచిన హెలికాప్టర్‌ను పైలెట్స్ పరిశీలించారు.. టెక్నీషియన్‌ను తీసుకొచ్చేందుకు హకీంపేటకు రెండో హెలికాప్టర్ బయలుదేరింది. మధ్యాహ్నం సమయంలో హకీంపేట నుంచి వచ్చిన టెక్నీషియన్స్ సాంకేతిక సమస్యలకు గురైన హెలికాప్టర్‌లో మరమ్మతులు చేపట్టగా తిరిగి హకీంపేటకు మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో తిరిగివెళ్లిపోయింది. కాగా హెలికాప్టర్ పైలెట్ చాకచక్యంగా సాంకేతిక సమస్యను గుర్తించటంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ హెలికాప్టర్‌లో పైలెట్‌తో పాటు మరో ఇద్దరు ప్రయాణిస్తున్నారు. హెలికాప్టర్ ఆగిన విషయం తెలుసుకున్న చిట్యాల ఏఎస్ఐ జాన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మరమ్మతులకు గురైన హెలికాప్టర్‌కు టెక్నీషియన్స్‌తో రిపేర్ చేయించేంత వరకు ఏఎస్ఐ బందోబస్తుగా ఉన్నారు.

వ్యవసాయ కూలీల సందండి



హెలికాప్టర్ వద్ద వ్యవసాయ కూలీల కోలాహలం

చిట్యాల శివారులోని వ్యవసాయ పొలాల్లో అకస్మాత్తుగా హెలికాప్టర్ దిగడంతో అక్కడ వ్యవసాయ కూలీల సందడి నెలకొంది. పొలం పనుల్లో నిమగ్నమైన వారంతా హెలికాప్టర్ వద్దకు వచ్చి సెల్‌ఫోన్‌లతో ఫొటోలు దిగారు. చిట్యాల, వనిపాకల గ్రామస్తులు అక్కడికివచ్చి సెల్ఫీలు దిగారు.



ఆగిన హెలికాప్టర్‌ను రిపేర్ చేసేందుకు టెక్నీషియన్‌లతో వచ్చిన మరో హెలికాప్టర్

నృసింహుడికి నిత్యకైంకర్యాలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నిత్య కైంకర్యాలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సుప్రభాత సేవ చేపట్టి అర్చన, అభిషేకం చేశారు.

పూడిక కాదు.. డ్రెయినేజీనే తవ్వారు

- అవసరం ఉన్న చోట వదిలి అవసరం లేనిచోట పనులు మొదలు
- మళ్లీ మీరే కట్టుకోవాలని దుకాణయజమానులకు హుకుం
- ఇదీ కోదాడ మున్సిపాలిటీ అధికారుల నిర్వాకం

కోదాడ: వరదలతో పట్టణ ప్రజలు ఓ పక్క నానా ఇబ్బందులు పడుతుంటే మరో పక్క కోదాడ మున్సిపాలిటీ అధికారులు అనాలోచిత నిర్ణయాలతో ఆ ఇబ్బందులు రెట్టింపు అవుతున్నాయి. వర్షాకాలానికి ముందే డ్రెయినేజీల్లో పూడిక తీయాల్సిన అధికారులు ఆ విషయాన్ని మరిచిపోయి తీరా వరదలు వచ్చి పట్టణ ప్రజలు తీవ్రంగా నష్టపోయిన తరువాత కళ్లు తెరిచారు. అదికూడా అవసరం ఉన్న చోట కాకుండా ఎలాంటి ఇబ్బంది లేని చోట కనీస సమాచారం లేకుండా పోలీసుల పహారా మధ్య డ్రెయినేజీల్లో పూడిక తీసే పనులు మొదలు పెట్టారు. పూడిక తీస్తే బాగానే ఉండు.. కానీ అధికారులు ఏకంగా అక్కడ ఉన్న డ్రెయినేజీకి ఇరువైపులా ఉన్న గోడలతో సహా పెకిలించి పడేశారు. ఇదేమిటని అడిగితే సమాధానం చెప్పేవారు లేరు. పైగా తొలగించిన డ్రెయినేజీలను ఆయా దుకాణాల యజమానులే కట్టుకోవాలని హుకుం జారీ చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

పూడికకాదు..

కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో కోదాడ మున్సిపాలిటీ అధికారులు మంగళవారం ఉదయం యుద్ధప్రాతిపదికన డ్రెయినేజీ పూడిక తీసే పనులు మొదలు పెట్టారు. వాస్తవానికి శకుంతుల థియేటర్ నుంచి రంగా థియేటర్ వరకు పూర్తి వంపు ప్రాంతం కావడంతో ఇక్కడ చుక్కనీరు కూడా నిలవదు. కానీ మున్సిపల్ అధికారులు మాత్రం ఎక్కడైతే నీరు నిలవదో అక్కడి నుంచి డ్రెయినేజీ పూడిక తీసే పనులు మొదలు పెట్టారు. ఉదయమే జేసీబీలతో అక్కడికి చేరుకున్న అధికారులు దుకాణాల యజమానులకు గానీ, భవనాల యజమానులకుగానీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా డ్రెయినేజీలపై ఉన్న కప్పులను పగలగొట్టారు. పూడిక తీయాల్సిన అధికారులు అక్కడ లేకుండా జేసీబీ డ్రైవర్స్‌కు పని అప్పగించడంతో వారు పూడికతో పాటు డ్రెయినేజీలకు ఇరువైపులా ఉన్న రాతి గోడలను సైతం తీసిపడేశారు. ఇదేమిటని అడిగిన వారికి సమాధానం చెప్పకుండా తమను పూడిక తీయనీయడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసుల పహారా మధ్య డ్రెయినేజీ గోడలతో సహా పెకిలించి పడేశారు. అక్కడి రాళ్లను ట్రాక్టర్లతో తరలించారు. ఇక ఇపుడు డ్రెయినేజీల నిర్మాణం చేయడానికి మున్సిపాలిటీకి నిధులు లేవు. ఆడ్రెయినేజీలను మీరే నిర్మించుకోవాలంటున్నారని పలువురు వాపోయారు.



హుజూర్‌నగర్ రోడ్డులో మురుగుకాల్వ గోడలతో సహా తవ్విన దృశ్యం

అవసరం ఉన్న చోట వదిలేశారు..

పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు రంగా థియేటర్ నుంచి శ్రీనివాస థియేటర్ వరకు నీరు రోడ్డుమీదకు చేరడంతో పాటు సెల్లార్ దుకాణాల్లోకి చేరింది. ఇక్కడ డ్రెయినేజీలు మొత్తం పూడిపోవడంతో పాటు ఆక్రమణలు జరిగాయి. ముందుగా ఇక్కడ పనులు మొదలు పెట్టాల్సిన అధికారులు అది వది లేసి ఏ సమస్య లేని చోట పెద్ద సమస్యను తయారు చేశారు. ముందు రంగా థియేటర్ నుంచి శ్రీనివాస థియేటర్ వరకు నాలాను శుభ్రం చేయడంతో పాటు వెంగమాంబ వైన్స్ వద్ద ఇరు వైపుల నుంచి వచ్చే డ్రెయినేజీ మూసి వేసి స్లాబ్ వేసి దుకాణం నడుపుతున్నారు. ఇక్కడి నుంచి కోదాడ పెద్దచెరువుకు వెళ్లే నాలాను పూర్తిగా ఆక్రమించి, స్లాబ్‌లు వేసి ఇళ్ల నిర్మాణం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీని వల్ల ఆర్ఎస్‌వీ ఫంక్షన్ హాల్ వద్ద ఉన్న ఇళ్లల్లోకి నీరు చేరింది. ముందు ఈ పనులు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



నాలా పై స్లాబ్‌వేసి చేపట్టిన ఇంటి నిర్మాణం

క్లుప్తంగా

పట్టుబడిన మద్యం ధ్వంసం

నాగారం: ఎన్నికల సమయంలో పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన మద్యాన్ని గురువారం నాగారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. 2023–2024 సంవత్సరంలో నాగారం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన 36 లిక్కర్ కేసులకు సంబంధించి 243 లీటర్ల మద్యం, బీర్లు పట్టుబడినట్లు తెలిపారు. ఈ మద్యాన్ని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ట్రాస్క్‌ఫోర్స్ సీఐ మల్లయ్య, తుంగతుర్తి ఎక్సైజ్ సీఐ రజిత, ఎక్సైజ్ ఎస్ఐ మూర్తి, ఏఎస్ఐ వెంకటయ్య, రైటర్ శేఖర్, పోలీసు సిబ్బంది నారాయణరెడ్డి, ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

72 కేసుల్లో పట్టుబడిన మద్యం..



మద్యాన్ని పారబోస్తున్న పోలీసులు

సూర్యాపేటటౌన్: గత సంవత్సర కాలంగా ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పట్టుబడిన మద్యాన్ని గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో ధ్వంసం చేశారు. 72 కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను నల్లగొండ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ ఉత్తర్వుల మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు మద్యం ధ్వంసం చేశారు. మొత్తం వీటి విలువ సుమారు రూ.2.5లక్షలు ఉంటుందని పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌నాయక్, పోలీసులు ఉన్నారు.

చెరువు తూము ధ్వంసం



ధ్వంసమైన కోమటికుంట చెరువు తూము

చిలుకూరు: మండలంలోని బేతవోలు కోమటికుంట చెరువు తూమును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. చెరువు భూమి ఆక్రమణదారులు వారి భూములు మునిగిపోకుండా ఉండేందుకు కావాలనే తూమును ధ్వంసం చేసి షట్టర్ పక్కకు వేశారని గ్రామస్తులు ఆరోపించారు. చెరువు నీరు వృథాగా పోతోందని, ఐబీ అధికారులు స్పందించి తూమును ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మేళ్లచెరువు: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండలం వేపలమదారం గ్రామానికి చెందిన నాగులమీరా తన ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు అతడి ఇంటిపై దాడి చేసి 13 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సహాయక చర్యలు ముమ్మరం



తొగర్రాయిలో శానిటైజేషన్ చేయిస్తున్న అధికారులు



వరదతో నష్టపోయిన బాధితుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

- తొగర్రాయి, కూచిపూడిలో వరదలతో నష్టపోయిన బాధితుల వివరాల సేకరణ
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చేస్తున్న అధికారులు
- ఇంటింటి సర్వే ప్రారంభించిన వైద్యసిబ్బంది

కోదాడరూరల్: భారీ వర్షాలతో ఉప్పొంగిన అంతరగంగా వాగు వరద ఉధృతికి నష్టపోయిన తొగర్రాయి, కూచిపూడి గ్రామాల్లో అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేశారు. అదేవిధంగా బాధితులకు పలువురు దాతలు భోజన సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. వరదతో సీజనల్ వ్యాధులు, చర్మవ్యాధులు ప్రబలకుండా పంచాయతీరాజ్ అధికారులు గ్రామాలను పూర్తిగా శానిటైజేషన్ చేస్తున్నారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించడంతో పాటు క్లోరినేషన్ నిర్వహిస్తున్నారు. ఇక వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే ప్రారంభించారు. అంటు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరిస్తున్నారు. మరో వైపు విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో ప్రజలకు, వ్యవసాయ మోటార్లకు విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు కూలిన స్తంభాల స్థానాల్లో కొత్తవాటిని ఏర్పాటు చేస్తున్నారు. పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌లను వినియోగంలోకి తీసుకొచ్చేందు మరమ్మతులు ప్రారంభించారు. ఇక రెవెన్యూ అధికారులు గ్రామాల్లో కొన్ని ఇళ్లకు పూర్తిగా, మరికొన్ని ఇళ్లకు పాక్షికంగా నష్టం జరగడంతో వారి వివరాలు సేకరిస్తున్నారు. మరో వైపు వ్యవసాయాధికారులు పంట నష్టం జరిగిన రైతుల వివరాలు సేకరిస్తున్నారు.

తాత్కాలిక వంతెన పనులు పూర్తి

వరద ఉధృతికి తొగర్రాయి పాత, కొత్త గ్రామాలను కలిపే వంతెన కొట్టుకుపోగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రెండు రోజులుగా చేస్తున్న తాత్కాలిక వంతెన పనులు పూర్తి కావడంతో ప్రజలు కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారు.

షాపు సహా మొత్తం కొట్టుకుపోయింది



బతుకుదెరువు కోసం తొగర్రాయి రోడ్డు వెంట జనరల్ స్టోర్, కిరాణషాపు ఏర్పాటు చేసుకున్నా. శనివారం రాత్రి వచ్చిన వరత ఉధృతికి షాపులో రూ.5లక్షల విలువ చేసే మిక్సీలు వంటి ఎలక్ట్రానిక్స్‌తో పాటు కిరాణం షాపు సహా కొట్టుకుపోయింది. ప్రభుత్వం తగిన నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– కొండపల్లి నాగరాజు, తొగర్రాయి

పంట పూర్తిగా దెబ్బతిన్నది



నేను 8 ఎకరాల్లో వరి నాటు వేయగా అంతరగంగా వాగు ఉధృతికి పంట పూర్తిగా దెబ్బతిన్నది. పొలంలో ఇసుక మేట వేయడంతో పాటు ఐదు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. నాలుగు వ్యవసాయ మోటార్లు కాలిపోయాయి.

గుండపనేని ప్రభాకర్‌రావు, తొగర్రాయి

నిత్యావసర సరుకుల పంపిణీ

కోదాడరూరల్: తొగర్రాయిలో వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ సాయం కింద గురువారం బియ్యంతోపాటు 17 రకాల నిత్యావసర సరుకులు అందజేసింది. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ సూరయ్య, కాంగ్రెస్ నాయకులు ఇర్ల సీతరాం రెడ్డి, రేపూరి వెంకటాచారి, వెంకటేశ్వరరావు, నంబూరి సూర్యం, లిక్కి వెంకటయ్య, వెంకటేశ్వర్లు, మదన్‌మోహన్‌రావు, వెంకన్న ఉన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న అధికారులు, కాంగ్రెస్ నాయకులు

కోలుకోని కాగితరామచంద్రాపురం



రైతుల పొలాల్లో వేసిన ఇసుక మేట

- కొనసాగుతున్న పాలేరు రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ నీటి ప్రవాహం
- ఇంకా నీటిలోనే రైతుల పంట పొలాలు

నడిగూడెం: నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వ కట్ట 132, 133 కిలోమీటరు వద్ద ఈ నెల 1న తెగింది. ఈ ఘటనలో ఆ గ్రామంతో పాటు ఇంకా పలు గ్రామాలకు చెందిన రైతులు ఇంకా కోలుకోలేదు. రెండు చోట్ల కట్ట తెగడంతో కాగితరామచంద్రాపురం, వల్లాపురం, ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం మందడినర్సయ్యగూడెం, రాజపేట, ఈశ్వరమాధారం, శీల్లి తండాలలో దాదాపు 300 ఎకరాలకు పైగా పంట మునిగి, తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. కట్ట తెగి ఐదు రోజులైనా, సాగర్ నీరు నిలిపివేసినా ఇంకా కొంతమేర వరద వస్తుండడంతో పాటు పాలేరు రిజర్వాయర్ బ్యాక్‌వాటర్ నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో అనేక మంది రైతుల పొలాలు ఇంకా నీటి మునిగే ఉన్నాయి. పలువురు రైతుల పొలాల్లో ఇసుక మేట వేసింది. ఆ ఇసుకను తీయాలంటే చాలా ఖర్చుతో కూడుకున్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ పనులు మరింత ఆలస్యమైతే ఇప్పటికే కాల్వ కింద సాగులో ఉన్న వరి పంట తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయకట్టు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం తక్షణమే మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పొలాల్లో ఇసుక మేట వేసింది



సాగర్ ఎడమ కాల్వకు సమీపంలోనే నాకు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేపట్టాను. గ్రామ సమీపాన సాగర్ కాల్వకు పడిన గండి వల్ల నాలుగు ఎకరాలు పూర్తిగా మునిగి, ఇసుక మేట వేసింది. పొలం ఆనవాళ్లు లేకుండా పోయింది. అప్పులు చేసి సాగు చేశా. ప్రభుత్వం స్పందించి ఇసుక మేటను తొలగించి, నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– చక్రాల వెంకన్న రైతు, కాగితరామచంద్రాపురం

నాలుగు ఎకరాలు నీటి మునిగింది



మా గ్రామ సమీపంలో నాలుగు ఎకరాల్లో వరి సాగు చేపట్టా. సాగర్ ఎడమ కాల్వకు రెండు చోట్ల గండ్లు పడడంతో యూటీ ద్వారా వచ్చిన వరద నీరంతా మా పొలం మీదుగా ప్రవహించింది. దీంతో నాలుగు ఎకరాలు పంట నష్టం వాటిల్లింది. విద్యుత్ మోటారు, మూడు విద్యుత్ స్తంభాలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. పంట నష్టం చెల్లించి ఆదుకోవాలి

– గడ్డికొప్పుల చంద్రశేఖర్‌రెడ్డి, కాగితరామచంద్రాపురం



కాగితరామచంద్రాపురంలో పంట పొలాల మీదుగా ప్రవహిస్తున్న వరద నీరు

ముంపు కాలనీల్లో అందని సదుపాయాలు



గోండ్రియాల రంగాపురం మధ్యలో కొట్టుకుపోయి రోడ్డు

అనంతగిరి: భారీ వరదలతో అతలాకుతలమైన అనంతగిరి మండలం కిష్టాపురం, గోండ్రియాల గ్రామాల ముంపు కాలనీ వాసులు సదుపాయాలు అందడం లేదంటూ ఆవేదన చెందుతున్నారు. గోండ్రియాల గ్రామంలోని రంగాపురం కాలనీలో నిత్యావసరాలు, తాగునీరు అందడం లేదు. దీంతో కాలనీలోని ఓ ఇంట్లోని బోరు మోటారు వద్ద తాగేందుకు నీరు పట్టుకుంటున్నారు. రంగాపురం నుంచి గోండ్రియాలకు మధ్యలో ఉన్న బీటీ, సిమెంట్ రోడ్డు భారీ వరదలకు దాదాపుగా 12 మీటర్ల పొడవునా సుమారు 6 అడుగుల లోతులో భారీ గుంత ఏర్పడింది. దీంతో గోండ్రియాలకు రంగాపురానికి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషపూరిత కీటకాలు ఇళ్లలోకి చేరుతున్నాయని భయపడుతున్నారు.

పెద్దఎత్తున పంటనష్టం..

వరదలతో పంటపొలాలు కొట్టుకుపోయి రాళ్ల కుప్పలు, ఇసుక మేటలు భారీగా వేశాయి. ఇప్పటికే దాదాపు నాట్లు వేసి నెల రోజులు దాటిందని, ఇప్పటి వరకు ఎకరాకు రూ.30వేలు ఖర్చయ్యాయంటూ విలపిస్తున్నారు. పొలాల్లో ఎటుచూసినా భారీ ఇసుకమేటలు వేశాయి. ప్రభుత్వం నుంచి తమకు సాయం అందించాలని గోండ్రియాల కౌలు రైతులు ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నారు.

తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం



ఇంట్లో నిత్యావసరాలకు, తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటి వరకు గ్రామపంచాయతీ ట్యాంకర్‌తో వాగుకు అవతల ఉన్న వారికే నీరు అందించారు. రంగాపురానికి అందించలేదు. వెంటనే నీటి ట్యాంకర్‌ను అందించాలి. –బట్టా కోటమ్మ, రంగాపురం

తినడానికి తిండి కూడా లేదు



మాది గోండ్రియాల రంగాపురం కాలనీ మాకు చిన్న రేకుల ఇల్లు ఉన్నది. వరదల కారణంగా ఇంట్లో ఉన్న సమాను పూర్తిగా కొట్టుకుపోయింది. ఇంట్లో ఉన్న బియ్యంతో సహా అన్ని కొట్టుకుపోయాయి. తినడాకి తిండి కూడా లేదు. వంట చేసుకోవడానికి ఇంట్లో ఎటువంటి సదుపాయాలు లేవు. మా ఇట్లు పూర్తిగా ధ్వంసమైంది. ప్రభుత్వం మాకు సహాయం అందిచాలి. – కొత్తూరి అనుమాయమ్మ

ట్రాక్టర్‌పై వెళ్లి వైద్య సిబ్బంది సేవలు

తుంగతుర్తి: వరుసగా కురుస్తున్న వర్షాలతో తుంగతుర్తి మండలంలోని కేశవాపురం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వైద్య సిబ్బంది గురువారం ట్రాక్టర్‌పై వెళ్లి మెడికల్ ఆఫీసర్ లింగమూర్తి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారు. వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. కలుషిత నీటితో గ్రామంలోని ప్రజలకు జ్వరాలు వస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్‌లో వస్తుండగా వాగు మధ్యలో ట్రాక్టర్ చెడిపోవడంతో ఇబ్బంది పడ్డారు.



కేశవాపురం గ్రామానికి ట్రాక్టర్‌పై వెళ్తున్న వైద్య సిబ్బంది

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా..

- ఏడు జిల్లాల్లో చోరీలు
- పోలీసుల అదుపులో దొంగ

కొండాపూర్(సంగారెడ్డి): తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం కొండాపూర్ సీఐ చంద్రయ్య వెల్లడించారు. హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడేనికి చెందిన సన్నిధి ఆంజనేయులు వృత్తి రీత్యా తాపీ మేస్త్రీ. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలను ప్రవృత్తిగా చేసుకున్నాడు. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాలప్డుతున్నాడు. బుధవారం రాత్రి సీసీఎస్ పోలీసులు మల్కాపూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఆంజనేయులు అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా చేసిన దొంగతనాలు ఒప్పుకున్నాడు. ఇప్పటి వరకు నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, ఖమ్మం, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో చోరీలకు పాల్పడ్డాడని, 30 కేసుల్లో నిందితుడిగా ఉండగా, ఇటీవల వికారాబాద్‌లో అరెస్ట్ అయ్యి జైలు జీవితం గడిపి మే 10వ తేదీన విడుదలయ్యాడని తెలిపారు. నిందితుడిపై 39 తులాల బంగారం, 189 తులాల వెండి, 2 బైక్‌లతోపాటు రూ.9.50 లక్షల నగదును అపహరించినట్లు కేసులు నమోదయ్యాయని వివరించారు. ప్రస్తుతం 15 తులాల బంగారం స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో సీసీఎస్ ఎస్సై శ్రీకాంత్, కొండాపూర్, మునిపల్లి ఎస్సైలు హరిశంకర్ గౌడ్, రాజేశ్ నాయక్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న సినిమాలకు చేయూతనిస్తాం



సినిమా పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ తదితరులు

- రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి: చిన్న సినిమాలు ప్రభుత్వం నుంచి చేయూతనిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తన స్వీయ దర్శకత్వంలో రేగట్టె లింగారెడ్డి నిర్మిస్తున్న 'మీకు ఇష్టమైతే రేపే మీ పెళ్లి' సినిమాకు సంబంధించిన పోస్టర్, ఆడియోను గురువారం నార్కట్‌పల్లి పరిధిలోని వివేరా హోటల్‌లో గురువారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అంశాలపై సినిమాలు తీయాలని అన్నారు. ఈ సినిమాకు బందారు దాయనయ్య కథా రచయితగా, మ్యూజిక్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పున్నపురాజు యాదగిరి, కల్లూరి శ్రీను, నేతగాని కృష్ణ, వరల రమేష్ తదితరులు ఉన్నారు.

విధులకు ఆటంకం కల్గించిన వ్యక్తిపై కేసు

మునగాల: మండలంలోని మాధవరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మహిళను కొక్కిరేణి గ్రామానికి చెందిన ఎల్లావుల సైదయ్య ఆర్టీఐ యాక్ట్ కింద సమాచారం అడగగా.. నిర్ణీత గడువు కాకముందే ఉద్దేశపూర్వకంగా ఆమెను బెదిరించినందుకు గాను గురువారం అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. తనకు తరచూ సైదయ్య ఫోన్ చేసి బెదిరించడంతో పాటు తాను విధులు నిర్వహిస్తున్న ప్రాంతానికి వచ్చి అసభ్యకరంగా మాట్లాడుతూ.. ఫొటోలు, వీడియోలను తీసి తాను డ్యూటీలో లేనట్లుగా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడని పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సైదయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాడు వెలవెల.. నేడు జలకళ



రెండేళ్ల క్రితం నీరులేక ఎండిపోయిన వేములూరు రిజర్వాయర్



నేడు ఉధృతంగా ప్రవహిస్తున్న వేమూలూరు రిజర్వాయర్

మఠంపల్లి: మఠంపల్లి మండలంలోని యాతవాకిల్ల వద్ద గల వేములూరు రిజర్వాయర్‌కు రెండు మూడేళ్లుగా సరైన వరద నీరు రాక, అలుగు పారక వెలవెలబోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలకళను సంతరించుకొని అలుగుపారుతోంది.

గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

సూర్యాపేటటౌన్: గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలను డీఎస్పీ రవి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని అన్నాదురై నగర్‌కు చెందిన భోగ చరణ్, జేజే నగర్‌కు చెందిన చిలకరాజు సందీప్, మరో వ్యక్తి కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని అరకులో గంజాయి కొనుగోలు చేసి సూర్యాపేటకు తీసుకొచ్చారు. బుధవారం సాయంత్రం 5గంటల సమయంలో స్థానిక రాజీవ్‌పార్కు సమీపంలో గంజాయిని ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

పులిచింతలకు తగ్గిన ఇన్‌ఫ్లో

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో చాలా వరకు తగ్గింది. గురువారం ప్రాజెక్టు సమీపంలో నదీ పరీవాహక ప్రాంతాల నుంచి 2,050 క్యూసెక్కులు, సాగర్, టెయిల్ పాండ్‌ల నుంచి 28,449 క్యూసెక్కుల నీరు వస్తోంది. దీంతో ప్రాజెక్టులోని 2 క్రస్ట్ గేట్లను 2.5 మీటర్లు పైకి ఎత్తి స్పిల్‌వే ద్వారా 41,456 క్యూసెక్కుల నీటిని, తెలంగాణ జెన్‌కోకు 16 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు ప్రస్తుతం 43.79 టీఎంసీల నీరు ఉంది. రిజర్వాయర్ నీటి మట్టం 175 అడుగులకు 173.71 అడుగుల వరకు ఉంది.

పాఠశాలలో నీరు లేక అవస్థలు



పాఠశాల బయటికొచ్చి బ్రెష్ చేసుకుంటున్న విద్యార్థులు

కోదాడరూరల్: మండల పరిధిలోని నెమలిపురిలో ఉన్న బీసీ బాలుర గురుకుల పాఠశాలలో నీరు లేక విద్యార్థులు గురువారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 530 మంది విద్యార్థుల ఉన్న ఈ పాఠశాలలో నీరు లేకపోవడంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు పాఠశాలకు సమీపంలోని రెడ్లకుంట మేజర్ ఎస్‌ఎస్పీ కాలువ, పీపీల వద్దకు వచ్చారు. అయితే బుధవారం రాత్రి కరెంట్ లేకపోవడంతో పాఠశాలలో నీరు లేదని, కరెంటు లేని ప్రతిసారి ఇలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని విద్యార్థులు తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ అనురాధను వివరణ కోరగా ఉన్న నీరు ఉదయమే అయిపోయిందని, బుధవారం రాత్రి విద్యుత్ లేకపోవడంతో నీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయని తెలిపారు. విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లగా.. వారి వెంట నలుగురు ఉపాధ్యాయులను సహాయకులుగా పంపించానని పేర్కొన్నారు.